సాక్షి
కుమురం భీం
సోమవారం । 22 । మే । 2023



నిండా నిర్లక్ష్యం.. పనుల్లో జాప్యం

గుత్తేదారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారుతోంది. కెరమెరి మండలంలో వాగులపై చేపడుతున్న వంతెనల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. 9లో▸



కేజీబీవీల్లో జీవన నైపుణ్యాల విద్య!

కౌమర దశలో తలెత్తే సమస్యలు సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కేజీబీవీల్లో చదువుకునే బాలికలకు జీవన నైపుణ్యాలు నేర్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42.0 /28.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లోనే బయటకు వెళ్లాలి.

న్యూస్‌రీల్

సోమేశ్‌కుమార్‌ను కలిసిన ఎమ్మెల్యే సక్కు



పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్‌: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా ఇటీవల నియమితులైన సోమేశ్‌కుమార్‌ను ఆదివారం ఎమ్మెల్యే ఆత్రం సక్కు హైదరాబాద్‌లోని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలు



ఏర్పాట్లు చేసిన అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్‌: నేటి నుంచి జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌వో మణెమ్మ ఆదివారం తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున సాయంత్రం క్రీడ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మైదానంలో విద్యుత్ లైట్లు సైతం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

తునికాకు కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

ఆసిఫాబాద్‌రూరల్‌: తునికాకు సేకరణలో ప్రమాదాలు జరగకుండా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అనేక మంది ఆదివాసీలు తునికాకు సేకరణలో పాల్గొంటారని తెలిపారు. మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం ముల్కలపేట గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురైన కూలీ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అడవి జంతువుల నుంచి రక్షణ కల్పించడంతో పాటు అటవీ ప్రాంతంలో ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇక నానో డీఏపీ..!

కేంద్ర ప్రభుత్వం రైతుల శ్రేయస్సుకు వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చింది. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలని, రైతులు ఆర్థికంగా ఎదగాలనే ఆలోచనతో ఎరువుల రవాణా ఖర్చులను తగ్గిస్తుంది. గతంలో గుళికల గల యూరియా, డీఏపీ వేస్తుండగా వాటి స్థానాల్లో ద్రవ రూపంలోని ఎరువులను తీసుకొచ్చింది. ఇప్పటికే నానో యూరియా మార్కెట్లోకి రాగా ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగానే నానో డీఏపీ కూడా అందుబాటులో ఉండనుంది. దీంతో ఒక్కో ఎరువు బస్తా వెనుక సుమారు రూ.1160 రైతుకు ఆదా కానుంది. ఇక రైతులకు అవగాహనే తరువాయి.

- ఎరువుల బస్తాల మోతకు చెక్
- ఇక ద్రవ రూపంలోనే..
- రవాణా వ్యయాలకు అడ్డుకట్ట
- ఇప్పటికే మార్కెట్లో ద్రవరూప యూరియా



రైతులకు నానో డీఏపీ, యూరియాపై వివరిస్తున్న వ్యాపారి

కెరమెరి(ఆసిఫాబాద్‌): మోత బరువులు రవాణా వ్యయం, అత్యవసరమైన సీజన్‌లో బ్లాక్ మార్కెట్‌కు అధిక ధరలకు డీఏపీ బస్తాల కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా (ఇఫ్కో) ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్స్ కో-ఆపరేటివ్ లిమిటెడ్. 'నానో డీఏపీ' ద్రవ రూప ఎరువును రైతులకు అందుబాటులోకి తేనుంది. గత నెల 26న ఢిల్లీలో ఇఫ్కో సదన్‌లో కేంద్ర హోం సహకార శాఖ మంత్రి అమిత్ షా మార్కెట్‌లో విడుదల చేశారు. ప్రపంచంలోనే తొలిసారిగా డీఏపీని ద్రవ రూపంలో తయారు చేయడంతో రైతులకు ఎంతో సౌకర్యం కలుగనుంది. జిల్లాలో 15 మండలాల్లోని 335 గ్రామ పంచాయతీల్లో 1.21 లక్షల మంది రైతులు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 4.50 లక్షల ఎకరాల్లో సాగుచేస్తున్నారు. అందులో 3.45 లక్షల ఎకరాల్లో పత్తి పంటను వేస్తున్నారు.

ఎంతో ఉపయోగం...

ఏళ్ల తరబడి రసాయనిక ఎరువులను అధిక మొత్తంలో రైతులు వినియోగిస్తున్నారు. ఇది రైతుల ఆరోగ్యాలకు ముప్పుగా పరిణమించిందని భావించినా ప్రభుత్వం ద్రవరూప నానో డీఏపీని తయారు చేయాలని భావించింది. రెండేళ్ల క్రితం నానో యూరియాను విడుదల చేసింది. ప్రస్తుతం అదే బాటలో డీఏపీని తీసుకొచ్చింది. నానో డీఏపీతో పంటల్లో దిగుబడి పెరుగనుంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగానే మార్కెట్లోకి అందుబాటులోకి రానుంది. దీంతో రైతులకు రవాణా భారం తగ్గనుంది.

ఖర్చు తక్కువ!

ఎకరానికి అర లీటర్ నానో డీఏపీ సరిపోతుందని వ్యవసాయాధికారులు భావిస్తున్నారు. స్ప్రేయర్లతో పిచకారీ చేస్తే పొలం మొత్తానికి విస్తరించే అవకాశం ఉంది. ఒక రైతుకు డీఏపీ బస్తా వేయాలంటే రూ.1760 ఖర్చు అవుతుంది. అదే అరలీటర్ నానో డీఏపీ వేస్తే కేవలం రూ.600 మాత్రమే అవుతుంది. అంటే ఒక రైతుకు రూ.1160 లాభం వస్తుందన్న మాట! నానో డీఏపీతో కేవలం ఒక సీసా ధర రూ.600 వరకు మాత్రమే ఉంటుండగా రైతులకు డబ్బు ఆదా కానుంది. నానో డీఏపీవో అదనంగా పోషకాలు సైతం ఉండడంతో పంటల్లో దిగుబడులు సైతం పెరగనున్నాయి.



ఆన్‌లైన్‌లో అందుబాటులోని నానో డీఏపీ

ఖర్చు తక్కువ!

ఎకరానికి అర లీటర్ నానో డీఏపీ సరిపోతుందని వ్యవసాయాధికారులు భావిస్తున్నారు. స్ప్రేయర్లతో పిచకారీ చేస్తే పొలం మొత్తానికి విస్తరించే అవకాశం ఉంది. ఒక రైతుకు డీఏపీ బస్తా వేయాలంటే రూ.1760 ఖర్చు అవుతుంది. అదే అరలీటర్ నానో డీఏపీ వేస్తే కేవలం రూ.600 మాత్రమే అవుతుంది. అంటే ఒక రైతుకు రూ.1160 లాభం వస్తుందన్న మాట! నానో డీఏపీతో కేవలం ఒక సీసా ధర రూ.600 వరకు మాత్రమే ఉంటుండగా రైతులకు డబ్బు ఆదా కానుంది. నానో డీఏపీవో అదనంగా పోషకాలు సైతం ఉండడంతో పంటల్లో దిగుబడులు సైతం పెరగనున్నాయి.

అవగాహన కల్పిస్తాం...



ఈ వానాకాల సీజన్‌లో డీఏపీ బస్తాలకు బదులు ద్రవ రూప డీఏపీని వినియోగించేలా రైతులకు అవగాహన కల్పిస్తాం. ఇప్పటికే నానో యూరియాపై గతంలోనే రైతులకు అవగాహన కల్పించగా కొంత మార్పు వచ్చింది. భవిష్యత్‌లో రైతులకు అంతా నానో యూరియా, డీఏపీ వినియోగించేలా అవగాహన కల్పిస్తాం.

– శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి,

ఇప్పుడిప్పుడే!



రెండేళ్లుగా నానో యూరియాను విక్రయిస్తున్నాం. కానీ రైతులకు ఇంకా దీనిపై నమ్మకం కుదరడం లేదు. వచ్చిన రైతులకు నానో యూరియా, అందుబాటులోకి రానున్న నానో డీఏపీపై అవగాహన కల్పిస్తున్నాం. గుళికల ఎరువులకు అలువాటుపడిన రైతులు ఒకేసారి మారాలంటే కొంత కష్టంగా ఉంటుంది. నానో వైపు మరల్చడానికి ప్రయత్నిస్తున్నాం.

– గిత్తే గణేశ్, వ్యాపారి, కెరమెరి

సర్కారు బడిలో 'లిప్'

- 6 నుంచి 9వ తరగతులపై ఫోకస్
- జిల్లాలో 17,664 మంది విద్యార్థులు
- త్వరలో టీచర్ల లిప్‌పై శిక్షణ
- తొలిమెట్టు తరహా మరో కార్యక్రమం



విద్యార్థులకు బోధిస్తున్న టీచర్ (ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్‌: సర్కారు బడిలో ఉన్నత పాఠశాలల్లో విద్యను మరింత బలోపేతం చేసేందుకు విద్యాశాఖ 'లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్'(లిప్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు విద్యా ప్రమాణాలు మెరుగు పర్చేందుకు ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చారు. విద్యార్థుల కనీస సామర్థ్యాలు పెంపు, విద్యాభివృద్ధే లక్ష్యంగా కార్యాచరణ మొదలు పెట్టింది. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయిలో ఎస్‌వోలకు శిక్షణలు పూర్తి చేసుకున్నారు. శిక్షణ పొందిన రిసోర్సు పర్సన్లతో జిల్లాలోని ఉపాధ్యాయులకు త్వరలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేయనున్నారు. వచ్చే 2023–24 విద్యా సంవత్సరంలో లిప్ కార్యక్రమం గతంలో తొలిమెట్టు తరహాలో ఉంటుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో 17,664 మంది విద్యార్థులు...

జిల్లా వ్యాప్తంగా మొత్తం 985 ప్రభుత్వ పాఠశాలున్నాయి. ఇందులో 42,450 విద్యార్థులు ఉండగా ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 171 ఉన్నాయి. ఇందులో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులు 17,664 మంది ఉన్నారు. వీరికి పాఠ్యాంశాలను విద్యార్థులు ధారాళంగా చదివేలా ప్రోత్సహించడం, మాతృభాషతో పాటు ద్వితీయ, తృతీయ భాషలను స్పష్టంగా ఉచ్చరణ, దోషాలు లేకుండా రాయగలిగేలా విద్యార్థులకు మార్గదర్శనం చేయనున్నారు. అభ్యసన పద్ధతుల ద్వారా లాంగ్వేజీలపై పట్టు సాధించేలా బోధన కొనసాగనుంది. అదే విధంగా రసాయన భౌతిక, జీవశాస్త్రం తదితర సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టిసారించనున్నారు. తొలిమెట్టు తరహాలోనే నెల వారీగా సమీక్షలు మధ్యంతర, వార్షిక పరీక్షలు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలను నిశితంగా పరిశీలించి అంచనా వేయనున్నారు. విషయం వారీగా చర్చించి బోధనోపకరణాలతో అవగాహన కల్పిస్తారు.

సామర్థ్యాలు సాధనకు లిప్...

కోవిడ్‌తో రెండేళ్లు ప్రత్యేక తరగతుల నిర్వహణ లేక విద్యార్థులు చదువుల్లో వెనుకబడి అభ్యసన సామర్థ్యాలు క్షీణించాయి. దీంతో వారిలో విద్యాప్రమాణాలు పెంచేందుకు గత ఏడాది ప్రాథమిక స్థాయిలో తొలిమెట్టు, ఈ సారి లెర్నింగ్ ఇమ్‌ప్రూవ్‌మెంట్ కార్యక్రమం పేరిట మరో వినూత్న విధానాన్ని తీసుకొచ్చింది. ఈ కార్యక్రమం ద్వారా 6 నుంచి 9వ తరగతి విద్యార్థులు కనీస సామర్థ్యాలు చదవడం, రాయడం, కూడికలు, తీసి వేతలు, రాయడం చాలా మంది విద్యార్థులకు రావడం లేదని తేలింది. విద్యా సంవత్సరంలో సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ఇన్ పబ్లిక్ సిస్టమ్, సేవ్ ది చిల్డ్రన్ సంస్థ సహకారంతో విద్యాశాఖ గత మార్చి 9–16వ తేదీ వరకు 6–9 తరగతి వరకూ అక్షర ప్రగతి పేరిట విద్యార్థుల సామర్థ్యాలపై సర్వే చేసింది. తరగతికి తగినట్టు సామర్థ్యాలు లేవని సర్వేలో తెలింది. తెలుగు, ఆంగ్లంతో పాటు కూడికలు, తీసివేతలు కూడా చేయడం లేదని గుర్తించారు. దీంతో విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచాలనే ఉద్దేశంతో లోపాలను సరిదిద్దేందుకు లిప్ కార్యక్రమం అమలు చేయనుంది.

విద్యా ప్రమాణాలు పెంచేలా..



ఉన్నత పాఠశాల విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచాలనే ఉద్దేశంతో విద్యాశాఖ తొలిమెట్టు తరహాలో ఈసారి లిప్ కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. ఈ కార్యక్రమం జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తాం. త్వరలో జిల్లాలోని ఉపాధ్యాయుల శిక్షణ కోసం సన్నద్ధం చేస్తున్నాం.

– అశోక్, డీఈవో

జాయింట్ సర్వే చేపట్టాలి

- అడిషనల్ కలెక్టర్ రాజేశం



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ రాజేశం

తిర్యాణి: పరిహార అడవుల పెంపకానికి అవసరమగు భూమి కోసం ఫారెస్టు, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ రాజేశం అన్నారు. ఆదివారం మండలంలోని పంగిడి మాదర గ్రామ శివారులో సీఏ ల్యాండ్స్ కోసం క్షేత్రస్థాయిలో ఫారెస్టు శాఖ సీసీఎఫ్ వినోద్‌కుమార్, ఐఎఫ్‌ఎస్ అరవింద్ ట్రిబెవాల్‌తో కలసి పరిశీలించి మాట్లాడారు. సర్వే నం.322లో 81 హెక్టార్ల రెవెన్యూ భూమిని ఫారెస్టు శాఖకు కేటాయించేందుకు నివేదికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

కల్యాణం.. సామూహిక(త)ం

- గ్రామాల్లో సామూహిక వివాహాలు
- దాతల సహకారం..
- పేద కుటుంబాలకు తగ్గుతున్న భారం

సాక్షి మంచిర్యాల డెస్క్‌: 'ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు' అన్నారు పెద్దలు.. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ రెండూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు భారంగానే మారుతున్నాయి. పెళ్లి చేయాలంటే టెంటు సామగ్రి నుంచి మొదలుకుని ఫంక్షన్ హాల్, బ్యాండుమేళాలు, వీడియో, ఫొటోగ్రఫి, విందు భోజనాలతో ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. నేటి ఆధునిక కాలంలో ప్రీవెడ్డింగ్ షూట్‌లు అ'ధన'పు భారాలే అవుతున్నాయి. ఇక కట్నకానుకల సంగతి సరేసరి.. పేద కుటుంబాల్లో పెళ్లి భారం కాకూడదనే ఉద్దేశంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు గ్రామాల్లో ఏటా సామూహిక వివాహాలు జరిపిస్తున్నారు. కూతురు పెళ్లి చేయడానికి అప్పు పుట్టలేదని సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్ గ్రామ పంచాయతీ పరిధి ముత్తన్నపేటలో తండ్రి వేల్పుల అయిలయ్య ఈ నెల 20న ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సామూహిక వివాహాల ఆవశ్యకతను తెలియజేస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఏటా జరుగుతున్న సామూహిక వివాహాలపై ప్రత్యేక కథనం.

ఎన్ని పెళ్లిళ్లయినా ఖర్చు అంతే..

నిర్మల్ జిల్లా తానూర్ మండలం ఝరి(బి) గ్రామంలో కరోనాకు ముందు సామూహిక వివాహాలు జరిపించేవారు. కోవిడ్ కారణంగా రెండేళ్లుగా నిర్వహించడం లేదు. అంతకుముందు తొమ్మిదేళ్లలో ఏటా పెళ్లిళ్లు జరిపిస్తూ 150 జంటలను ఏకం చేశారు. ఇదే మండలంలోని సింగన్‌గాం గ్రామంలో 20, బోరిగాంలో 20 జంటలకు నాలుగైదేళ్ల క్రితం వివాహం జరిపించారు. ఒక పెళ్లి జరిపించినా.. సామూహిక వివాహాలు జరిపించినా ఖర్చు అంతే వస్తుందని గ్రామస్తులు కలిసి సమష్టిగా నిర్ణయం తీసుకున్నారు. పెళ్లికొడుకు తరఫున రూ.30 వేలు, పెళ్లికూతురు తరఫున రూ.20 వేలు వసూలు చేసి భోజనాల ఖర్చుగా వెచ్చించేవారు.

- కుమురంభీం జిల్లా చింతలమానేపల్లి మండలం శివపెల్లి గ్రామంలో గత ఏడాది ఫిబ్రవరి 2న సామూహిక వివాహాలు జరిపించారు. శివాలయం వద్ద కొత్తపల్లి చంద్రయ్య, లక్ష్మి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ 101 ఆదివాసీ జంటలకు వివాహం జరిపించారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు, నాయకులు హాజరై కొత్త జంటలను ఆశీర్వదించారు. ప్రతీ జంటకు బట్టలు, పుస్తెమెట్టెలు, దేవుళ్ల చిత్రపటాలు, వంటసామగ్రి తదితర వస్తువులతో కిట్ కానుకగా అందజేశారు. కొత్తపల్లి శ్రీనివాస్ ఆదివాసీ గ్రామాల్లో పర్యటించిన సమయంలో ఆదివాసీ గిరిజనుల ఆర్థిక పరిస్థితులు చూసి చలించిపోయారు. పెళ్లిళ్లు చేయడానికి వారు పడుతున్న ఇబ్బందులు దృష్టికి రావడంతో 50 జంటలకు సామూహిక వివాహం జరిపించాలని నిర్ణయించారు. చాలామంది ఆసక్తి చూపడంతో నెల రోజుల్లోనే ఆ సంఖ్య కాస్త 101కి చేరింది. దీంతో రూ.20లక్షలు వెచ్చించి ఆలయంలో సామూహిక వివాహాలు జరిపించారు.
- ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం నర్సాపూర్ గ్రామంలో 38 ఏళ్ల క్రితం ప్రారంభమైన సామూహిక వివాహాల ఆచారం నేటికీ కొనసాగుతోంది. ఈ ఏడాది మే 4న నాలుగు జంటలకు ఒకే వేదికపై వివాహం జరిపించారు. పేద, ధనిక తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తమ పిల్లల పెళ్లిళ్లు జరిపిస్తుంటారు. 38ఏళ్ల క్రితం కరువు ఏర్పడి రైతుల కుటుంబాలు వృథా ఖర్చులను అరికట్టేందుకు 1984లో సామూహిక వివాహాలు చేయడానికి నిర్ణయించాయి. అప్పటి నుంచి ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. ఇప్పటివరకు ఈ వేదిక ద్వారా సుమారు 800 జంటలు ఒక్కటయ్యాయి.
- ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం దస్నాపూర్ గ్రామంలో ఆంద్ ఆదివాసీ కుల గురువు శ్రీసంత్ పూలాజీబాబా ప్రేరణతో పూలాజీబాబా ధ్యాన్ మందిర్ ఉత్సవ కమిటీ, ఆంద్ ఆదివాసీ సేవా సంఘం ఆధ్వర్యంలో గత 28 సంవత్సరాలుగా సామూహిక వివాహాలు జరిపిస్తున్నారు. ఏటా ఐదు నుంచి పది జంటలు ఏకమవుతున్నాయి. దస్నాపూర్‌గూడ, హర్కపూర్‌ఆంద్‌గూడ, అంజీ, మామిడిగూడ గ్రామాల్లో సామూహికంగా వివాహాలు జరిపిస్తున్నారు. ఈ ఏడాది మే 2న హర్కపూర్ ఆంద్‌గూడలో నిర్వహించిన వేడుకల్లో ఐదు జంటలు, దస్నాపూర్‌గూడలో మూడు, అంజీలో ఐదు జంటలు ఏకమయ్యాయి. ఖర్చులు తగ్గడంతోపాటు గ్రామాల మధ్య స్నేహభావం పెంపొందుతుందని ఆంద్ ఆదివాసీ పెద్దలు చెబుతున్నారు. తల్లిదండ్రులకు ఆర్థికంగా ఇబ్బందులు తగ్గించడానికి ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఒక్కో జంట నుంచి రూ.20 వేల నుంచి రూ.25వేలు కమిటీ సభ్యులు సేకరిస్తారు.





ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి, కుమురంభీం జిల్లా చింతలమానేపల్లిలో సామూహిక వివాహాలు(ఫైల్)

ఎమ్మెల్యే కోనప్ప కూతురి పెళ్లితోపాటే..

కుమురంభీం జిల్లా సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా సామూహిక వివాహాలు జరిపిస్తున్నారు. కోనప్ప తన కూతురు మధులిక వివాహం సమయంలో కాగజ్‌నగర్ పట్టణంలో 11జంటలకు వివాహం జరిపించి తండ్రి హృదయాన్ని చాటుకున్నారు.

- కాగజ్‌నగర్‌లోని ఎస్పీఎం క్రీడామైదానంలో 2014లో 113 జంటలకు పెళ్లి జరిపించారు.
- కౌటాల మండలం ప్రాణహిత సమీపంలో ఓ సంవత్సరం ఎనిమిది జంటలకు, మరో ఏడాది 16జంటలకు సామూహిక వివాహాలు జరిపించారు.
- 2018లో బెజ్జూర్ మండలం సొమిని ప్రాణహిత వద్ద 103 జంటలకు వివాహాలు చేయించారు. 2021లో పెంచికల్‌పేట మండలం భద్రకాళి ఆలయంలో 126 జంటలకు వివాహాలు జరిపించారు.
- పెళ్లి సమయంలో నూతన జంటలకు మంగళ సూత్రాలు, పెళ్లిబట్టలు, బీరువా, తినుబండారాలు, వంట పాత్రలు అందజేస్తుంటారు. పెళ్లికి వచ్చిన బంధువులకు భోజనాలు ఏర్పాటు చేస్తుంటారు.

ఆర్థిక పరిస్థితులు చూసి చలించిపోయా..



సిర్పూర్ నియోజకవర్గంలోని ఆదివాసీ గిరిజన గ్రామాల్లో పర్యటించిన సమయంలో ఆదివాసీ గిరిజనుల ఆర్థిక పరిస్థితులు చూసి చలించిపోయాను. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆదివాసీలు వివాహం చేసుకుని ఇబ్బందుల్లో ఉన్నారని అర్థమైంది. వారికి అండగా ఉండాలని సామూహిక వివాహాల నిర్ణయం తీసుకున్నాను. స్థానిక ఆదివాసీ నాయకుల సహకారంతో అర్హులైన జంటలను గుర్తించి కొత్తపల్లి చంద్రయ్య, లక్ష్మి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు జరిపించాను. ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించి కుట్టుమిషన్లు అందజేస్తున్నాం. కంటిపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి బెల్లంపల్లిలో కాటరాక్ట్ ఆపరేషన్లు చేయిస్తున్నాం. మరిన్ని సేవా కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

– కొత్తపల్లి శ్రీనివాస్, బీజేపీ కుమురంభీం జిల్లా అధ్యక్షుడు

కూతురికి కానుకగా వచ్చిన బంగారంతో పుస్తెలు చేయించి..



పెళ్లి బట్టలు అందిస్తున్న దేవర వినోద్

కుమురంభీం జిల్లా రెబ్బెన మండలం ఇంద్రానగర్‌కు చెందిన దేవర వినోద్ లాక్‌డౌన్ సమయంలో గ్రామాల్లో కొందరికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆ సమయంలో కొందరు ఆర్థిక ఇబ్బందుల కారణంగా పెళ్లి చేసుకోలేదనే విషయం ఆయన దృష్టికి వచ్చింది. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సామూహిక వివాహాలు జరిపిస్తుండడాన్ని స్ఫూర్తిగా తీసుకుని సామూహిక వివాహాలపై కుటుంబ సభ్యులు, తనకు తెలిసిన వారితో చర్చించాడు. సామూహిక వివాహాలు చేయించాలని నిర్ణయించుకున్నాడు. వినోద్ తన కూతురు 21వ రోజుకు కానుకగా వచ్చిన తులం బంగారంతో 11 మందికి పుస్తెలు చేయించాడు. పుస్తెలు చేసిన వ్యక్తి కొంత బంగారం కలిపాడు. మరికొందరు ఆర్థికంగా సహకరించారు. దీంతో 11 జంటలకు ఇంద్రానగర్ గ్రామంలోని కనకదుర్గాదేవి స్వయంభూ మహంకాళి ఆలయంలో గత ఏడాది ఫిబ్రవరి 10న వివాహం జరిపించాడు. పెళ్లికి వచ్చిన బంధువులకు భోజనాలు ఏర్పాటు చేశాడు. కాగజ్‌నగర్‌కు చెందిన గజ్జెల శ్రీనివాస్, సురేష్ వంట పాత్రలు, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి నూతన జంటలకు బిందెలు, ఎమ్మెల్యే ఆత్రం సక్కు బట్టలు అందజేశారు. రఫిక్ అనే వ్యక్తి పెళ్లి సమయంలో టెంట్ ఉచితంగా వేశాడు. మహంకాళి ఆలయ అర్చకుడిగా పని చేస్తున్న వినోద్ గ్రామంలో జరిగే పెళ్లిళ్లకు ఆలయం తరఫున పుస్తెమెట్టెలు అందించేలా సహకరిస్తున్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మహిళ మృతదేహం

చెన్నూర్‌రూరల్: మండలంలోని సోమనపల్లిలో శనివారం సాయంత్రం గుర్తు తెలియని మహిళ(55) మృతదేహం లభ్యమైంది. ఎస్సై మహేందర్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మతిస్థిమితం లేకుండా గ్రామంలో సంచరించే గుర్తు తెలియని మహిళ గ్రామంలో మృతిచెందింది. వడదెబ్బతో మహిళ మృతిచెంది ఉంటుందని, మృతదేహాన్ని చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు. తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని కోరారు.

బావిలో పడి ఎద్దు మృతి

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుద్దాల గ్రామ పంచాయతీలోని తుర్కపల్లిలో బావిలో పడి కావిరి శంకర్‌కు చెందిన ఎద్దు మృతి చెందింది. నీరు తాగేందుకు వెళ్లి ఎద్దు ప్రమాదవశాత్తు బావిలో పడింది. నెల రోజుల క్రితమే జత ఎడ్లను కొనుగోలు చేశానని, చనిపోయిన ఎద్దు విలువ రూ.50వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు.

టైర్ పగిలి లారీ బోల్తా


బోల్తా పడ్డ లారీ

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఐబీ సమీపంలో ఆదివారం తెల్లవారు జామున లక్సెట్టిపేట వైపు నుంచి ఆసిఫాబాద్ వెళ్తున్న బెల్లం లోడ్ లారీ ముందు టైర్ పేలడంతో అదుపుతప్పి బోల్తా పడింది. కాగా ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. ఉదయం పోలీసులు బోల్తా పడిన లారీని జేసీబీ, క్రెయిన్ సాయంతో తొలగించారు.

జ్వరంతో యువకుడి మృతి


శ్రీనివాస్ (ఫైల్)

పెంచికల్‌పేట్: మండలంలోని జిల్లెడ గ్రామానికి చెందిన దుర్గం శ్రీనివాస్(32) అనే యువకుడు జ్వరంతో బాధపడుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 17న శ్రీనివాస్‌కు తీవ్ర జ్వరం రాగా చికిత్స నిమిత్తం మంచిర్యాల ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు చేసి జాండీస్‌తో పాటు ఊపిరితిత్తులు, లివర్ దెబ్బతిన్నట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ శ్రీనివాస్ మృతి చెందాడు. మృతుడికి భార్య స్వప్న, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య

భైంసాటౌన్: మద్యానికి బానిసగా మారిన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన భైంసా పట్టణంలోని గణేశ్‌నగర్‌లో చోటుచేసుకుంది. గణేశ్‌నగర్‌కు చెందిన అందెల్వార్ సాయినాథ్(45) స్థానికంగా కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు. మద్యానికి బానిస కావడంతో ఎవరూ పనికి పిలిచేవారు కాదు. దీంతో మనస్తాపం చెందిన సాయినాథ్ శనివారం రాత్రి భార్య, పిల్లలు కాలనీలోని ఓ శుభకార్యానికి వెళ్లగా ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీను తెలిపారు.

కేజీబీవీల్లో జీవన నైపుణ్యాల విద్య!


- ప్రత్యేక కరదీపికల పంపిణీ
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు

మంచిర్యాలఅర్బన్: కౌమర దశలో శారీరకంగా తలెత్తే సమస్యలు సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు బాలికలకు తగిన నైపుణ్యాలు అవసరం. ఇందుకు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయా(కేజీబీవీ)ల్లో చదువుకునే బాలికలకు జీవన నైపుణ్యాలు నేర్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అవసరమైన ప్రత్యేక పుస్తకాలు సైతం కేజీబీవీలకు చేరాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థినులకు రోజువారీ పాఠ్యాంశాలతో పాటే జీవన నైపుణ్యాల విద్య బోధించనున్నారు.

6 నుంచి 8వ తరగతులకు..

కేజీబీవీల్లో 6, 7, 8వ తరగతులు చదివే బాలికలకు జీవన నైపుణ్యాల విద్య బోధించనున్నారు. టీనేజీలో సరైన నిర్ణయాలతో భవిష్యత్తు పరిణామాలు అంచనా వేయడం, సహచరులు, ఉపాధ్యాయులు, కుటుంబంతో అనుబంధాలు గుర్తించేలా విద్యా బోధన చేయనున్నారు. తమను తాను మదింపు చేసుకుంటూనే ఒత్తిళ్లను అధిగమించి భావోద్వేగాలు నియంత్రించుకునేందుకు జీవన నైపుణ్యాలు ఎంతో దోహదపడనున్నాయి. నూతన విద్యా సంవత్సరంలో జీవన నైపుణ్యాలపై వారానికి మూడు తరగతులు బోధించనున్నారు.

జిల్లాలో 2,214 పుస్తకాలు పంపిణీ



ఎనిమిదో తరగతికి సంబంధించిన కవర్‌పేజీ

ఇప్పటికే తరగతుల వారీగా ప్రత్యేక పుస్తకాలను సమగ్రశిక్ష అధికారులు పాఠశాలలకు అందజేశారు. 18 కేజీబీవీల్లో 6 నుంచి 8వ తరగతులకు సంబంధించిన 2,214 పుస్తకాలు పంపిణీ చేశారు. ఒక్కో తరగతికి 40 చొప్పున 18 మండలాలకు 720 పుస్తకాలు, ముగ్గురు టీచర్లకు 54 లైఫ్ స్కిల్స్ మోడల్స్‌ను అందజేశారు.

ఎన్నో అంశాలు..

జీవన నైపుణ్య విద్య అమలుకు రూపొందించిన కరదీపికలో ఎన్నో అంశాలు పొందుపర్చారు. బలాలు, బలహీనతలు, శక్తి సామర్థ్యాల విశ్లేషణతో విద్యార్థినులు తమను తాము స్వీయ మదింపు చేసుకోవడం, ఆత్మవిశ్వాసం పెంపొందించేలా చేయడం ద్వారా విద్యార్థినులు అవకాశాలు, లక్ష్యాలను గుర్తించడం వంటి అంశాలు ఉన్నాయి. జీవన నైపుణ్యాలు మెరుగుపర్చుకోవడం ద్వారా సహచరుల ద్వారా ఎదురయ్యే ఒత్తిళ్లను ఎలా ఎదుర్కోవాలి..? వారిని ఎలా అర్థం చేసుకోవాలి వంటి అంశాలు అవగతమవుతాయి. క్లిష్టపరిస్థితులు ఎదురైనప్పుడు భిన్న కోణాల్లో విశ్లేషించటం, ఆలోచణ శక్తి పెరగడంతో పాటు పరిష్కారం వెతికేలా సామర్థ్యం పెంపొందుతుంది. ఏ విషయంలోనైనా స్పష్టంగా మాట్లాడటం, అవసరాన్ని బట్టి స్వరంలో హెచ్చుతగ్గులు, జీవితంలో వివిధ సందర్భాల్లో సరైనా నిర్ణయాలు తీసుకోవడం, సమస్య స్వభావాన్ని, కారణాలను గుర్తించటం, మార్గాన్ని ఎంపిక చేసుకోవటం, ఫలితాలకు బాధ్యత వహించడం వంటి ఎన్నో అంశాలు బాలికలు నేర్చుకోనున్నారు.

జిల్లాస్థాయి చదరంగం పోటీలు ప్రారంభం


పోటీలు పరిశీలిస్తున్న జీఎం దేవేందర్

రెబ్బెన: మండలంలోని గోలేటి సింగరేణి పాఠశాలలో జిల్లాస్థాయి చదరంగం పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి సింగరేణి బెలంపల్లి ఏరియా జీఎం దేవేందర్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చదరంగం మెదడుకు మేతలా పనిచేస్తుందని, చదరంగం ఆటకు సింగరేణి సంస్థ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుమలత శ్రీధర్ రెడ్డి, చెస్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కోట సుధాకర్, ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రావు, ఉపాధ్యక్షుడు ఉపేందర్, కోశాధికారి మల్లేష్, ఆదిలాబాద్ జాయింట్ చైర్మన్ కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య


రాధ (ఫైల్)

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని ప్రాణహిత కాలనీ (షిర్కే)లో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని కుంట రాధ (56) అనే మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై చంద్రకుమార్, మృతురాలి కుమారుడు శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు కొన్ని నెలల నుంచి క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స తీసుకుంటుంది. ఆదివారం మధ్యాహ్నం శ్రీనివాస్ పిల్లలతో బయటకు వెళ్లి సాయంత్రం వచ్చి చూడగా రాధ ఉరేసుకుని విగతజీవిగా కనబడింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేశీదారు పట్టివేత


స్వాధీనం చేసుకున్న దేశీదారుతో పోలీసులు

వాంకిడి: మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న దేశీదారును పట్టుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని లక్ష్మీనగర్‌కు చెందిన కొట్రంగె స్వామి అనే వ్యక్తి 68 దేశీదారు 90ఎమ్ఎల్ బాటిళ్లను మహారాష్ట నుంచి తీసుకువచ్చే క్రమంలో పట్టుబడ్డాడు. స్వాధీనం చేసుకున్న దేశీదారు విలువ సుమారు రూ.4080 ఉంటుందని పేర్కొన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలు


పోటీలకు ముస్తాబైన స్టేడియం

రామకృష్ణాపూర్: సీఎంకప్ జిల్లాస్థాయి క్రీడాపోటీలు పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈనెల 22 నుంచి 24వరకు నిర్వహించనున్న పోటీలకు స్టేడియం ముస్తాబైంది. మొత్తం 18 మండలాల నుంచి యువతీయువకులు పోటీల్లో పాల్గొననున్నారు. 22న వాలీబాల్, కబడ్డీ, బాక్సింగ్, రెజ్లింగ్, టేబుల్‌టెన్నిస్, 23న అథ్లెటిక్స్, వెయిట్‌లిఫ్టింగ్, బాస్కెట్ బాల్, స్విమ్మింగ్, ఆర్చరీ, 24న హ్యాండ్‌బాల్, ఫుట్ బాల్, హాకీ, జిమ్నాస్టిక్స్, షూటింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు పోటీలు నిర్వహిస్తామన్నారు. బాడ్మింటన్ పోటీలు మంచిర్యాల హైటెక్‌సిటీలో, లాన్‌టెన్నిస్ పోటీలు బెల్లంపల్లి టీసీవోఏ క్లబ్‌లో జరుగుతాయని తెలిపారు. 46 మంది ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయులు పోటీలను పర్యవేక్షించనున్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు బాల్కు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి కల్పించనున్నారు.

23న జిల్లాస్థాయి లాన్ టెన్నిస్ పోటీలు

మందమర్రిరూరల్: సీఎంకప్ క్రీడా పోటీల్లో భాగంగా ఈ నెల 23న బెల్లంపల్లిలోని టీసీవోఏ క్లబ్‌లో జిల్లాస్థాయి లాన్ టెన్నిస్ పోటీలను జిల్లా యువజన క్రీడా విభాగం అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు జెడ్పీహెచ్ఎస్ (బాయ్స్) పీడీ రాజేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. 15 -36 సంవత్సరాల వయస్సు కలిగి, ఆసక్తి గల వారు 7013989157 నంబర్‌లో సంప్రదించి వివరాలు తెలపాలన్నారు.

ఎదురెదురుగా కార్లు ఢీ


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కార్లు

భీమారం: మంచిర్యాల -చెన్నూరు జాతీయ రహదారిపై భీమారం వద్ద ఆదివారం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాలకు చెందిన ఎండీ సాధిక్ కారులో మంచిర్యాల నుంచి చెన్నూర్ వెళ్తుండగా మందమర్రి మండలం ఆందులపేటకు చెందిన మేకల శంకర్ కారులో అతివేగంగా వచ్చి ఎదురుగా ఢీకొట్టాడు. ప్రమాదంలో సాదిక్‌కు గాయపడగా, శంకర్‌కు తీవ్రమైన గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని శంకర్‌ను చికిత్స నిమిత్తం ఎలక్కపేట ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించగా, సాధిక్‌ను కుటుంబసభ్యులు మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం కారణంగా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాక్టర్, ఆటో ఢీ.. ఒకరు మృతి

- మరొకరి పరిస్థితి విషమం


సంఘటన స్థలంలో శ్రీనివాస్ మృతదేహం

కాగజ్‌నగర్‌టౌన్: ట్రాక్టర్, ఆటో ఢీకొని శ్రీనివాస్ (45) అనే వ్యక్తి మృతిచెందిన ఘటన కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మంచిర్యాల జిల్లా దండెపల్లి మండలం రాజంపేటవాసి శ్రీనివాస్ కొన్నేళ్లుగా కాగజ్‌నగర్‌లోనే ఉంటున్నాడు. బ్రెడ్ విక్రయాలు జరిపే ఆటోలో పని చేస్తున్నాడు. కాగజ్‌నగర్ మండలం ఆరెగూడ గ్రామానికి చెందిన తన మామయ్య భగవయ్యా ఐదుగురు కుటుంబ సభ్యులతో కలిసి భీమిని మండలం ఎల్లారం పోచమ్మ ఆలయాన్ని దర్శించుకుని రాత్రి 8గంటల ప్రాంతంలో తిరిగి ఆరెగూడకు ఆటోలో బయల్దేరారు. కాగజ్‌నగర్ నుంచి ఈజ్‌గాం వైపు వెళ్తున్న ఆటోను ఈజ్‌గాం నుంచి అతివేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. దీంతో ఆటోలో డ్రైవర్ సీటు వద్ద ఉన్న శ్రీనివాస్ కింద పడడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. వృద్ధురాలు జగతి పరిస్థితి విషమంగా ఉండగా స్థానిక సివిల్ ఆస్పత్రికి తరలించారు. కాగజ్‌నగర్ టౌన్ ఎస్సై సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య సుజాత ఉన్నారు.

ప్రజలపై భారం మోపుతున్న కేంద్రం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జన్నారం: నోట్ల రద్దుతో ఆర్థికంగా వెనుకబడిన దేశ ఆర్థిక వ్యవస్థ గాడి పడుతున్న సమయంలో ప్రధాని నరేంద్రమోదీ రూ.2 వేల నోట్లు రద్దు చేసేందుకు యత్నించడంతో ప్రజలపై మళ్లీ ఆర్థికంగా భారం పడుతుందని ఏఐసీసీ రీసెర్చ్ డిపార్టుమెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ ఆరోపించారు. జన్నారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో రూ.2 వేల నోట్లు చెలామణి నిలిపివేయడంపై ఆదివారం నిరసన తెలిపారు. మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వినోద్‌నాయక్ మాట్లాడుతూ గతంలో పెద్దనోట్ల రద్దుతో ప్రజలు ఇబ్బంది పడ్డారని తెలిపారు. తిరిగి అదే పరిస్థితి తీసుకురావడానికి ప్రధాని రూ.2 వేల నోట్ల రద్దు నిర్ణయం తీసుకుంటున్నారని ఆరోపించారు. కర్ణాటక ఓటమి తర్వాత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతిలేని నిర్ణయాలు తీసుకుంటుందని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభుదాస్, ప్రధాన కార్యదర్శి ఫసీఉల్లా, నాయకులు ఇమ్రాన్‌ఖాన్, కరుణాకర్, అజార్, ఇందయ్య, రమేశ్, శ్రీనివాస్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌వైజర్‌పై కేసు నమోదు

సాక్షి ఎఫెక్ట్..

వేమనపల్లి: ముల్కలపేట, రాచర్ల గ్రామాల మధ్య వంతెన నిర్మిస్తున్న కాంట్రాక్టర్ చేస్తున్న విద్యుత్ చౌర్యంపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. ఏఈ దీక్షిత్ ఆధ్వర్యంలో అధికారులు నిర్మాణంలో ఉన్న వంతెనను పరిశీలించారు. సూపర్‌వైజర్ ఏలేశ్వరం శ్రీనివాసచారిపై కేసు నమోదు చేశారు. అనంతరం ముల్కలపేట గ్రామం ట్యాంకు వద్ద ఐడిల్ లైన్‌కు తగిలించిన కొండీలను తొలగించారు. వంతెన నిర్మిత స్థలం వద్ద ప్రమాదకరంగా ఉన్న స్తంభం, విద్యుత్ లైన్ పక్కకు మార్చాలని కాంట్రాక్టర్‌కు నోటీసులు అందజేశారు. రెండు రోజుల్లో వరంగల్ ఎన్‌పీడీఎస్ రీజన్ పరిధిలోని ఉన్నతాధికారుల బృందం విచారణ చేపట్టనున్నట్లు ఏఈ పేర్కొన్నారు. కాగా సంబంధిత కాంట్రాక్టర్‌పై కాకుండా సూపర్‌వైజర్‌పై మాత్రమే కేసు నమోదు చేయడం గమనార్హం.

మార్షల్ ఆర్ట్స్‌తో శారీరక దారుఢ్యం


శివమహేశ్‌ను సన్మానిస్తున్న మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ నాయకులు

మందమర్రిరూరల్: మార్షల్‌ఆర్ట్స్‌తో మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం కలుగుతుందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆల్‌స్టైల్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పులిపాక మోహన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంతర్జాతీయ మార్షల్‌ఆర్ట్స్ క్రీడాకారుడు శివమహేష్ అభినందన సభకు హాజరై మాట్లాడారు. ఈ నెల 1నుంచి 5 వరకు రష్యా దేశంలోని మాస్కోలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో శివమహేశ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి రంగు శ్రీనివాస్, వెంకటేష్, నరేష్, నాగలక్ష్మి, ప్రసాద్, నవీన్ ఉన్నారు.


నిరవధిక సమ్మెలో సొమ్మసిల్లిన వీవోఏ


అస్వస్థతకు గురైన సుమతి

లక్సెట్టిపేట: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో వీవోఏలు చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం 35వ రోజుకు చేరింది. ఎండ తీవ్రతకు చందారం గ్రామానికి చెందిన వీవోఏ సుమతి అస్వస్థతకు గురైంది. వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జిల్లా అధ్యక్షుడు లింగంపెల్లి వెంకటేశ్ మాట్లాడుతూ 35 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. తమ న్యాయపరమైనా డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షురాలు అనిత, మండల అధ్యక్షురాలు కళావతి, కోశాధికారి లావణ్య, వీవోఏలు పాల్గొన్నారు.

కడుపు పండింది.. కన్నీరే మిగిలింది!

- సంతానం కోసం 12 ఏళ్లు నిరక్షణ..
- రూ.12 లక్షల వరకు ఖర్చు
- ఇటీవలే పండంటి బిడ్డకు జననం..
- 26 రోజులకే అనారోగ్యంతో బాలింత మృతి


లలిత మృతదేహం

వేమనపల్లి(బెల్లంపల్లి): పిల్లల కోసం 12 ఏళ్లుగా ఆ జంట ఎక్కని గుడి మెట్టు లేదు. మొక్కని దేవుడు లేదు. వైద్యం కోసం ఎన్నో ఆస్పత్రులు తిరిగారు. చికిత్స కోసం ఉన్న కాస్త భూమి, మేకలు, పశువులు అమ్మేశారు. సుమారు రూ.12 లక్షల వరకు ఖర్చు చేశారు. తొమ్మిది నెలల క్రితం వారి నిరీక్షణ ఫలించింది. ఆమె గర్భందాల్చింది. ఇటీవలే పండంటి పాపకు జన్మనిచ్చింది. దీంతో ఆ జంట ఆనందానికి అవధులు లేవు. వారి ఇంటికి కొత్త వెలుగు వచ్చిందని ఎంతో సంతోష పడ్డారు. కానీ వారి ఆనందం ఎన్నో రోజులు నిలవలేదు. అనారోగ్యంతో తల్లి మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

12 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం..

మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం జాజులపేట గ్రామానికి చెందిన పాలె కిష్టయ్యది వ్యవసాయ కుటుంబం. కుమురంభీం జిల్లా దహెగాం మండలం మొట్లగూడం గ్రామానికి చెందిన దగ్గరి బంధువు లలిత(32)ను 12 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. కానీ వారికి సంతానం కలగలేదు. పిల్లల కోసం ఎన్నో ఆస్పత్రులు తిరిగారు. రూ.12 లక్షల వరకు ఖర్చు చేశారు. వారి నిరీక్షణ ఫలించి 26 రోజుల క్రితం లలిత ఆడబిడ్డకు జన్మనిచ్చింది.


పసికందుతో తండ్రి కిష్టయ్య

ఇంట్లో పనిచేసి అస్వస్థత..


బాలింత అయిన లలిత బిడ్డ బాగోగులు చూసుకుంటూ.. ఇంట్లో చిన్న చిన్న పనులు చేసుకుంటోంది. శనివారం ఇంట్లో తునికాకు మడత పెట్టి, కట్టలు కట్టింది. రాత్రి భోజనం చేసి పడుకుంది. అర్ధరాత్రి ఒక్కసారిగా అస్వస్థతకు గురైంది. వెంటనే కుటుంబ సభ్యులు ప్రైవేట్ వాహనంలో మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే చనిపోయింది. 26 రోజుల పసిగుడ్డును వదిలి తల్లి కానరాని లోకాలకు వెళ్లిపోవడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. చిన్నారిని చేతుల్లో పట్టుకొని కిష్టయ్య విలపిస్తున్న తీరు స్థానికులను కంటతడి పెట్టించింది.

అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించాలి


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న వివేక్‌వెంకటస్వామి, రఘునాథ్ వెరబెల్లి

పాతమంచిర్యాల: రాష్ట్రంలోని అవినీతి, నిరంకుశ ప్రభుత్వాన్ని గద్దెదించి రాష్ట్రం అభివృద్ధి కోసం బీజేపీకి అధికారం ఇవ్వాలని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి, జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని 13వ వార్డు హమాలీవాడలో ఆదివారం ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బీజేపీని గెలిపించాలని కోరారు. గత ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ప్రజలకు అనేక హామీలు ఇచ్చి ఇప్పటికీ నెరవేర్చలేదని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, రజనీశ్‌జైన్, సంతోష్, శ్రీశైలం, రాజన్న, శ్రీనివాస్, బోయిని దేవేందర్, పల్లిరాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వాంకిడి: మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాల 2012 -2013 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి వారికి పాఠాలు బోధించిన గురువులను ఆహ్వానించి సన్మానించారు. పదేళ్ల తర్వాత కలుసుకున్న మిత్రులను ఆత్మీయంగా పలకరించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులతో పాటు గురువులు ఎమ్‌ఏ జబ్బర్, జాడి సంతోష్, రాజన్న, భూపతి సంతోష్, రాజేశ్వర్, లక్ష్మయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.


వానర ఆగ్రహం!

వనం వీడి జనావాసాల్లోకి వస్తున్న కోతులు ఇళ్లలో చొరబడి బీభత్సం సృష్టిస్తున్నాయి. వాటి చేష్టలతోనే మనల్ని భయపెడతాయి. కోతులకు భయపడి జనమే పారిపోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో అయితే కొన్నేళ్లుగా వానరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆదివారం కోతుల సమూహం మార్కెట్ ఏరియాలో దండయాత్రకు బయల్దేరింది. ఈ క్రమంలో ఓ కోతి మెడికల్ షాపులో చొరబడింది. సిబ్బంది దానిని వెళ్లగొట్టే క్రమంలో కోతి బయటకు వెళ్తుండగా ఒక్కసారిగా డోర్ వేయడంతో అది కోతికి తగిలింది. దీంతో అది అక్కడికక్కడే మృతిచెందింది. దీనిని గమనించిన మిగతా వానరాలు ఆగ్రహానికి గురయ్యాయి. సామూహికంగా మెడికల్ షాప్‌పై దాడికి యత్నించాయి. ఆందోళన చెందిన షాప్ యజమాని వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు అక్కడికి చేరుకుని కోతులను అక్కడి నుంచి వెళ్లగొట్టారు. ఈ క్రమంలో అవి చనిపోయిన కోతిని తీసుకుని వెళ్లిపోయాయి.

- (లక్సెట్టిపేట)